ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కుమరం భీం

జిల్లా వార్తలు

4

ఆదివారం 4 మే 2025





ఈయన పెంచికలపేట మండలం కమ్మర్‌గాం గ్రామానికి చెందిన ఆదివాసీ రైతు పోర్తెట్టి హన్మంతు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 2023లో గిరివికాసం పథకంలో బోరు వేయించింది. త్రీఫేజ్ కరెంటు లేక వర్షాధారంగా సేద్యం చేయాల్సిన పరిస్థితి. గ్రామానికి త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం మంజూరైనా అనుమతి లేదని అటవీశాఖ పనులను అడ్డుకున్నది.

చేనులో వేసిన బోరును చూపిస్తున్న ఈ గిరిజన మహిళా రైతు పేరు ఎలాది జ్యోతి. పెంచికలపేట మండలంలోని కమ్మర్‌గాం గ్రామం. గిరివికాసం పథకంలో ప్రభుత్వం ఆమెకు 2023లో ఉచితంగా బోరు వేయించింది. త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అటవీశాఖ అభ్యంతరంతో పనులు నిలిచిపోయాయి. దీంతో పంటల సాగుకు ఇబ్బంది పడుతోంది.



అందని ద్రాక్షలా 'గిరివికాసం'

- అటవీ అనుమతులే అసలు సమస్య
- త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం లేక గిరిజనుల ఇబ్బందులు
- వర్షాధార పంటలతోనే నెట్టుకొస్తున్న వైనం



కమ్మర్‌గాంలో గిరివికాసం పథకంలో వేసిన బోరు

కొండ కోనల్లో నివసించే గిరిజనులు ఏటా వర్షాధార పంటలనే సాగు చేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టితో నష్టాల దిగుబడిని మూటగట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని రైతులను ఆదుకునేందుకు గత ప్రభుత్వం గిరి వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. ఇద్దరి నుంచి పది మంది రైతులను ఒక యూనిట్‌గా చేసి వారికి అవసరమైన సాగునీరు అందించాలని పథకం రూపొందించింది. బోరు వేసి త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం, పైప్‌లైన్ వేయాలని భావించింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా బావులకు సైతం ఈ పథకం వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ పలు చోట్ల అటవీశాఖ అనుమతులు అడ్డంకిగా మారడంతో ఈ పథకం గిరిజనులకు అందని ద్రాక్షలానే మారుతోంది.

బెజ్జూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు వ్యవసాయమే ఊపిరి. వ్యవసాయ సాగుకు అన్ని రకాల సదుపాయాలు ఉంటే వారు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. దేశానికి వెన్నముకలాంటి రైతులకు ఆపద ముంచుకొస్తుంది. సాగుకు అవసరమైన సదుపాయాలు లేక ఏటా రైతుకు తీవ్ర నష్టం కలుగుతోంది. వ్యవసాయానికి అవసరమైన త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యాన్ని గిరిజన రైతులకు ఉచితంగా అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. అటవీశాఖ అభ్యంతరాలతో పనులు ముందుకు సాగడం లేదు. ఉమ్మడి జిల్లాలో 180కిపైగా గ్రామాలు రిజర్వు అటవీ ప్రాంతంలో ఉన్నాయి. వాటిలో పనులు చేయడానికి అనుమతులు లేవని అటవీశాఖ అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. ఉమ్మడి జిల్లాలో రూ.3.71కోట్లతో చేపట్టిన గిరివికాసం పథకంలో గిరిజన రైతులకు ఉచితంగా బోరు, మోటరు అందజేయడం, ఐటీడీఏ ఆధ్వర్యంలో విద్యుత్తు సంస్థ ద్వారా గిరిజన గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో అత్యధికంగా అటవీ గ్రామాలే ఉండటం దీంతో గిరి రైతులకు అనుమతులు శాపంగా మారాయి. ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చాలన్న తీసుకున్న నిర్ణయం త్రీఫేజ్ విద్యుత్ అందని ద్రాక్షగా మారింది. ఆదివాసీ రైతులకు ఉచితంగా బోర్లు వేయించగా, అటవీ అనుమతులు లేక త్రీఫేజ్ విద్యుత్ సదుపాయం లేక వేసిన బోర్లు నిరుపయోగంగా మారాయి.

● ఎంపిక చేసిన గ్రామాల్లో..

గిరివికాసం పథకంలో భాగంగా గిరిజన రైతులకు ఎంపిక చేసిన గ్రామాల్లో ఆదివాసీ గిరిజన రైతుల పంటచేల వరకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి. దానికి అవసరమైన స్తంభాలు ఏర్పాటు చేయడం, కొత్తగా తీగలు అమర్చడం, ముగ్గురు, నలుగురు రైతులుంటే వారికి 25కేవీఏ, ఐదు నుంచి పది మంది వరకు ఉంటే 63కేవీఏ, పది నుంచి వంద మంది రైతులుంటే 100కేవీఏ నియంత్రికలను ఏర్పాటు చేయాలి. అవసరమైన నిధులను ఐటీడీఏ ద్వారా నేరుగా తెలంగాణ ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థకు చెందిన అధికారులకు డీడీల రూపంలో చెల్లిస్తోంది.

● పథకం అమలైతే..

గిరివికాసం పథకంలో భాగంగా త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కలిగితే రైతులకు అన్ని రకాల మేలు కలిగే అవకాశం ఉంటుంది. వ్యవసాయ రంగంలో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉంటాయి. పంటచేలకు త్రీఫేజ్ సౌకర్యం లేకపోవడంతో రైతులకు సాగు దిగుబడి లేక ఆర్థికంగా వెనుకబాటుకు గురవుతున్నారు. అటవీ అనుమతులు లేకపోవడంతో గిరివికాసం పథకం గిరిజన రైతులకు అందకుండా పోయింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 98గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఇందులో 55గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం లేదు. అదే విధంగా కెరమెరి, తిర్యాణి, సిర్పూర్(యు), బెజ్జూరు, దహెగాం, తదితర మండలాల్లో అటవీ అనుమతులు లేని కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యానికి అటవీ అనుమతులు లేవని దీంతో పనులు సాగడం లేదు. ఏళ్లుగా అనుమతులు లేక గిరి రైతులు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యానికి నోచుకోలేకపోతున్నారు. దీంతో రైతులు వర్షాధారంపైనే ఆధారపడుతే పంటలు వేసుకుంటు న్నారు. ప్రభుత్వం స్పందించి అనుమతులు వచ్చేలా చూడాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలు

సిర్పూర్(యు), మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదోబ్బ గ్రామ సమీపంలో శనివారం ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయని ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆటో డ్రైవర్ అజాగ్రతగా నడడపంతో ఆటో పెద్దదోబ్బ గ్రామ సమీపంలో బోల్తా పడిందని చెప్పారు. ఇందులు ప్రయణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యా యని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగికి చెక్కు అందజేత

రెబ్బెన, మే 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగం చేస్తూ మెడికల్ ఇన్వాలిడేట్ అయిన తిరుపతికి బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ మచ్చగిరి నరేందర్ శనివారం ఏకమొత్తం చెల్లింపు చెక్‌ను అందజేశారు. ఖైరిగూడ ఉపరితల గనిలో జనరల్ మంజూరుగా పని చేస్తున్న తిరుపతి మెడికల్ ఇన్వాలిడేట్ అయ్యారు. వారసులకు ఉద్యోగం కాని, ఎంఎంసీ కాకుండా దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆదాయ పన్ను మినిహాయిపు కాగా మంజూరైన రూ.21.56లక్షల చెక్ అందజేశారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీవైపీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ బాబా తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

ఆసిఫాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబెద్ బిన్ యాహియా ఆధ్వర్యంలో శనివారం అంబలి పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమాన్ని పీఏసీఎస్ చైర్మెన్ అలీబిన్ అహ్మద్, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రెహమాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వినాయక్‌రావ్, శంకర్, భీంరావ్, ఉమర్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలపై పట్టింపు కరువు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు శంకర్, పాల్గొన్న జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి, దివాకర్

ఆసిఫాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలును పట్టించుకోవం లేదని సీపీఐ రాష్ట్ర నాయకుడు కలవేణి శంకర్ అన్నారు. స్థానికంగా శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదిన్నర పూర్తవుతున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదన్నారు. రుణమాఫీ, రైతుభరోసా, పంటల బీమా పథకాలలో రైతులలో అసంతృప్తి నెలకొందన్నారు. ఆపరేషన్ కాగర్‌ని నిలిపివేసి మవోయిస్టులను చర్చలకు ఆహ్వానించాలని కోరారు. మావోయిస్టులు కూడా ఆయుధాలు విడిచి ప్రజా స్రవంతిలోకి రావాలన్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సీపీఐ నాల్గవ మహాసభలను ఈనెల 25న నిర్వహించనున్నామని, వీటిని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా కార్యదర్శి బద్రీ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో మహాసభలను నిర్వహించేలోగా ఆయా మండలాల కార్యదర్శులు మండల శాఖల మహాసభలను నిర్వహించాలని సూచించారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి, దివాకర్ పాల్గొన్నారు.

'నీట్'కు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



జిల్లా కేంద్రంలోని నీట్ పరీక్ష కేంద్రం

ఆసిఫాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే నీట్ పరీక్ష కోసం జిల్లా అధికారులు ఏర్పా ట్లు పూర్తి చేశారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం 287 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయత్రం 5 గంటల వరకు పరీక్ష కొనసాగనుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తారు. నిమిషం అలస్యమైనా అనుమతించరు. పరీక్ష కేంద్రంలో 12 గదులను ఏర్పాటు చేశారు. ఒక్కో గదిలో 24 మంది అభ్యర్థుల చొప్పున కేటాయించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

బస్సులో మర్చిపోయిన సర్టిఫికెట్లు అందజేత

ఆసిఫాబాద్‌రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ డిపోకు చెందిన లహరి బస్సులో ఓ ప్రయాణికురాలు మర్చిపోయిన సర్టిఫికెట్లను శనివారం ఆర్టీసీ అధికారులు ఆమె కుటుం బ సభ్యులకు అందజేశారు. హైదరాబాద్ నుంచి ఆసిఫాబాద్ వస్తున్న లహరి బస్సులో ప్రయాణికురాలు స్టడీ సర్టిఫికెట్లను మర్చిపోయి మంచిర్యాలలో దిగింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు డ్రైవర్ మోహన్‌బాబును ఫోన్‌లో సంప్రదించారు. డిపోకు వచ్చి సర్టిఫికెట్లు తీసుకోవాలని చెప్పాడు. ప్రయాణికురాలి కుటుంబ సభ్యులు డిపోకు వచ్చి సర్టిఫికెట్లను తీసుకున్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పీవీ రాజం, మహిళా కానిస్టేబుల్ విజయలక్ష్మి, ఏడీసీ సుధాకర్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన



వాంకిడిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

వాంకిడి, మే 3 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకంలో స్వయం ఉపాధి పొందేందుకు రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను శనివారం ఎంపీడీవో కార్యాల యంలో అధికారులు పరిశీలించారు. మండలంలోని బంబార, బెండార, సామెల గ్రామ పంచాయతీల నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి ఇంట ర్వ్యూలు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ధ్రువపత్రాలను పరిశీలించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల నుంచి 1,788 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. కార్యక్రమం లో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఐకేపీ ఏపీఎం మహేష్, ఎస్‌బీఐ మేనేజర్ నందకిషోర్, టీజీబీ మేనేజర్ జాడీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో శనివారం మండలంలోని పార, ఉసేగాం తదితర గ్రామాల్లో రాజీవ యువ వికాసం పథకం కోసం చేసుకున్న దరఖాస్తులను అధికారులు శనివారం పరిశీలించారు. ఇటీవల రాజీవ్ యువ వికాసం కింద ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలు రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. స్వయం ఉపాధి పొందేందుకు చేసుకున్న దరఖాస్తులను ఎంపీడీవో సుధాకర్ రెడ్డి ఎంపీవో మోహన్ తదితరులు పరిశీలించి లబ్ధిదారు లను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో 163 మంది దరఖాస్తు చేసుకున్నారు. 90 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి గుణ్వంత్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తిర్యాణి అస్పిరేషనల్ బ్లాక్‌లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కలెక్టరేట్‌లో తిర్యాణి అస్పిరేషనల్ బ్లాక్‌లో 38 అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ అస్పిరేషనల్ బ్లాక్‌లో మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా 38 అంశాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భిణుల వివరాలను తప్పని సరిగా పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రసవం తర్వాత కూడా వివరాలను నమోదు చేయాలన్నారు. క్షయ, మధుమేహ వ్యాధిగ్రస్తుల వివరాలు అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సకాలంలో పోషకాహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మూత్రశాలలు, తాగునీటి వసతి కల్పించే దిశగా చర్యలు తీసుకోవా లన్నారు. గ్రామపంచాయతీలలో టీ ఫైబర్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద గృహల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపుల బలోపేతం దిశగా అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరికీ లబ్ధి కలిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. విద్యాశాఖ అధికారులు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించాని చెప్పారు. అలా గుర్తించిన వారిని బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు సీతారాం, భాస్కర్, సురేష్, రామకృష్ణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవుగూడ, కొండాపటార్ గ్రామాల్లో చిరుధాన్యాల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న జీవన్ ఆధార్ సొసైటీ డైరెక్టర్ సాక్రుబాయి

జైనూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుగూడ, కొండాపటార్ తదితర గ్రామాల్లో చిరుధాన్యాల సాగుపై జీవన్ ఆధార్ సొసైటీ ప్రతినిధులు శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సాక్రుబాయి మాట్లాడుతూ గతంలో అత్యధికంగా చిరుధాన్యాలు సాగు చేయడం మూలంగా పోషకాహారం లభిస్తుం డేదని చెప్పారు. ఇటీవల కాలంలో చిరు ధాన్యాల సాగు చేయడం తగ్గించారని అన్నారు. పోషకాహారం తీసుకోక పోవడం వల్ల అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని చెప్పారు. రైతులు చిరుధాన్యాల సాగు పెంచాలని కోరారు. పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకంతో పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులు చిరుధాన్యాలు సాగు చేస్తామని, సేంద్రియ ఎరువులను వినియోగిస్తామని తీర్మానం చేశారు. అంతకు ముందు ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించారు. కూలీలు వలస పోకుండా ఉపాధి పనులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ కోఆర్డినేటర్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

బుద్ధ జయంతిని విజయవంతం చేయాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

వాంకిడి, మే 3 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహం వద్ద ఈ నెల 12 నిర్వహించే బుద్ధ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహోళ్‌కార్ అశోక్ కోరారు. మండల కేంద్రంలోని జెత్వాన్ బుద్ధ విహార్ బుద్ధ జయంతి పోస్టర్లను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జయంతి వేడుకలకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన బౌద్ధ గురు భదంతే ధర్మసారథిథేరో, భంతే బుద్ధ శరణ్ హాజరవుతున్నారని చెప్పారు. బౌద్ధ గురువుల ఆధ్వర్యంలో నిర్వహించే జయంతి వేడుకలకు జిల్లా నుంచి అధికసంఖ్యలో బౌద్ధఉపాసకులు తరలి రావాలని అయన కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు జయరాం ఉప్రె, విజయ్, రోషన్, నాగ్‌సేన్, విఠల్, రమేశ్, రాకేష్, చింటు తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించడం లేదని పీఎంకేకే కేంద్రానికి ఇంటి యజమాని తాళం



భవనానికి తాళం వేస్తున్న ఇంటి యజమాని

ఆసిఫాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రం (పీఎంకేకే) నిర్వాహకులు కొన్నేళ్లుగా అద్దె చెల్లించడంలేదని శనివారం భవనానికి ఇంటి యజమాని తాళం వేశాడు. పట్టణంలో ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రం (పీఎంకేకే) ఒక అద్దె భవనంలో ఏర్పాటు చేసి వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. శనివారం శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు శిక్షణ సర్టిఫికెట్లను అందజేస్తామని నిర్వాహకులు చెప్పారు. దీంతో అభ్యర్థులు దూర ప్రాంతాలనుంచి శిక్షణ సర్టిఫికెట్ల కోసం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఇంటి యజమాని రవీందర్ అక్కడికి చేరుకొని అద్దె చెల్లించాలని నిర్వాహకుడు ఆఫిస్‌ను నిలదీసాడు. అద్దె చెల్లించాలని వాదించి రూం షెటర్‌కు తాళం వేశాడు. దీంతో శిక్షణ సర్టిఫికెట్ల కోసం వచ్చిన అభ్యర్థులు ఇబ్బం దులు పడ్డారు. రెండు,మూడు రోజులలోగా సర్టిఫికెట్లు అందజేస్తామని నిర్వాహకులు చెప్పడంతో అభ్యర్థులు నిరాశగా వెళ్లిపోయారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం

భీమయ్య, కాగజ్‌నగర్ ఫైర్ అధికారి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండాఆ ప్రజలకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఫైర్ అధికారి: వేసవిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పట్ట ణాలు, పల్లెల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. మాక్ డ్రిల్ కూడా నిర్వహించాం. కర పత్రాలు అందజేయడం ద్వారా సూచలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే అంశాలు ఏంటీ?

ఫైర్ అధికారి: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల తరుచూ జరుగుతుంటాయి. ప్రధా నంగా ఇంటిలో వెంటిలేషన్ సక్రమంగా లేక పోవడంతో గ్యాస్ లీకేజీ ఏర్పడి మంటలు అంటుకునే అవకాశం ఉంది. గడ్డివాములు నిల్వ చేసుకునే ఇళ్ల పరిసరాల్లో అప్రమత్తంగా ఉండాలి. చిన్నపాటి అగ్గిరవ్వ రాజుకున్నా పూర్తిగా కాలిపోయే ప్రమాదంగా ఉంటుంది. గ్యాస్ లీకేజీ జరిగిన సమయంలో వెంటనే తడిగుడ్డతో సిలిండర్ భాగాన్ని కప్పేస్తే పెను ప్రమాదాన్ని నివారించే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి: అడవిలో ఏర్పడే కారుచిచ్చు నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుం టున్నారు..?

ఫైర్ అధికారి: అడవిలో కారుచిచ్చు ఏటా ఏర్పడుతోది. బాటసారులు తాగిపడేసే సిగరేట్, బీడీతో మంటలు వ్యాపించే అవకాశం ఉంది. ఈ విషయంలో కూడా గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎవరు కూడా సమీప అటవీ ప్రాంతాల్లో సిగరేట్, బీడీలు తాగి పడేసేటప్పుడు పూర్తిగా చల్లార్చాలని సూచిస్తున్నాం. అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉండే పొలాలు, చేనుల్లో రైతులు నిప్పు పెట్టే చర్యలు చేయొద్దని చెబుతు న్నాం. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందిస్తే నియంత్రించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.

- కాగజ్‌నగర్ టౌన్, ఆంధ్రజ్యోతి

అరకొర వసతులు

- కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో సమస్యలు
- ప్రయాణికులకు సరిపడా షెడ్లు కరువు
- నిధులు మంజూరైనా సాగని పనులు

కాగజ్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే అతి పెద్దదైన కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో సమస్యలు పేరుకు పోయాయి. ఉమ్మడి జిల్లాలోనే ఈ రైల్వేస్టేషన్‌కు అధిక ఆదాయం సమకూరుతోంది. కానీ సమస్యలు పరిష్కారానికి నోచుకోవం లేదు. రైల్వే శాఖ దేశ వ్యాప్తంగా అన్నీ రైల్వేస్టేషన్లను ఆధునీకీకరిస్తోంది. ఇందులో భాగంగా కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌కు కోటి రూపాయలు కేటాయించింది. ఈ నిధులతో మూడు షెడ్లు, మూడోఫాం నిర్మాణం చేపట్టేందుకు రెండేళ్ల క్రితం పనులను ప్రారంభించింది. ప్లాట్‌ఫాం పనులు పూర్తయ్యాయి. కానీ మూడు షెడ్ల నిర్మాణాలు పూర్తికాక పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మూడో ప్లాట్‌ఫాంను సికంద్రాబాద్ నుంచి రాకపోకలు సాగించే రైళ్ల కోసం కేటాయించారు. నిత్యం సికింద్రాబాద్ ప్రాంతాలకు వెళ్లే వారు అధికంగా ఉంటారు. ఇక్కడ ప్రస్తుతం రెండు పెద్ద షెడ్లు మాత్రమే ఉన్నాయి. ఇంకా మూడు షెడ్లను నిర్మించాల్సి ఉంది. షెడ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండలోనే రైల్వేస్టేషన్‌లో నిరీక్షించాల్సి వస్తోంది. నీటి వసతి కుళాయిలు ఏర్పాటు చేశారు. కానీ నీరు రాక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



షెడ్లు నిర్మించని రెండో ప్లాట్‌ఫాం

లిఫ్ట్ సౌకర్యం లేదు..

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల కోసం లిఫ్ట్ సౌకర్యం లేదు. మూడో ప్లాట్ ఫామ్‌పై మరో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఫుడ్ కోర్టులు, కిడ్స్ ప్లే ఏరియా అవసరం ఉంది. వందేభారత్‌తో పాటు కేరళ, కాజీపేట- పుణే ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్ల హాల్టు అనుమతుల కోసం ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు.

కాగజ్‌నగర్ నుంచి షిర్డికి వెళ్లేందుకు గతంలో రైలు హాల్టింగ్ ఉండేది. కొవిడ్ నేపథ్యంలో ఈ హాల్టును తీసేశారు. భాగ్యనగర్, ఇంటర్ సిటీ, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌లో పరిశుభ్రత పాటించడం లేదు. సికింద్రాబాద్- కాగజ్‌నగర్ మధ్యనడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కాగజ్‌నగర్‌కు రాత్రి 10 గంటలకు రావాల్సి ఉంటుంది. కాని ఇదే సమయంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉంటున్నాయి. దీంతో భాగ్యనగర్ రైలు రాత్రి 11 నుంచి 12 గంటల వరకు కాగజ్‌నగర్‌కు చేరుకుంటుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

రైల్వేల అభివృద్ధి దిశగా..

రైల్వేల అభివృద్ధి దిశగా కేంద్ర ప్రభుత్వం 'అమృత్ భారత్ స్టేషన్ సీం'ను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా కాగజ్‌నగర్‌కు ఇటీవల రూ. 36 కోట్ల నిధులు మంజూ రు చేస్తూ చోటు కల్పించింది. దీంతో స్టేషన్ సమీప ప్రాంత విస్తరణ, స్టేషన్ నూతన భవన నిర్మాణంతో పాటు ప్లాట్‌ఫారాలపై ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఎస్కలేటర్, లిఫ్టు, ప్రవేశ ముఖద్వారం, ప్రత్యేకంగా వాహనాల పార్కింగ్ పనులు చేపట్టనున్నారు. సరిపడా మూత్రశాలలు, బుకింగ్ కార్యాలయాలు. ఏటీఎం, తాగు నీటి సౌకర్యం, ప్లాట్‌ఫారాలపై డిజిటల్ డిస్‌ప్లేలు, బోర్డులు, వీఐపీ, మహిళలు, సాధారణ ప్రయాణికులకు వేచి ఉండే గదులు, ఫలహారశాలలు, రెండో వైపు నుంచి ప్రవేశానికి ఏర్పాట్లు చేయనున్నారు.



కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హులు ఉండకూడదు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా

ఆసిఫాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల జాబితా లో అనర్హులు ఉండకూడదని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాలతో కలిసి మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఇందిరమ్మ ఇళ్ల జాబితా, రేషన్‌కార్డుల జారీ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల జాబితా పూర్తిగా పారదర్శకంగా రూపొందించాలని చెప్పారు. జాబితాలో అవకతవకలు ఉన్నట్లయితే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాబితాలో అర్హుల పేర్లు మాత్రమే ఉండాలని సూచించారు. జాబితాలో పేర్లు ఉన్న వారు ఇళ్ల పనులు ప్రారంభించేలా దృష్టి సారిం చాలన్నారు. ఈనెల 5వ తేదీ వరకు మంజూరయిన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. కొత్త రేషన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించా లన్నారు. అర్హులైన వారికి కార్డులు మంజూరే చేసేలా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం కేంద్ర మంత్రులు పర్యటించను న్నారని, అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో శనివారంఅదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్‌లతో కలిసి కేంద్ర మంత్రుల పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫోర్‌లైన్ రహదారి 363ను సోమవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇతర కేంద్ర మంత్రులతో కలిసి ప్రారంభిస్తారని చెప్పారు. ఈ నేపథ్యంలో కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు సమీపంలో హెలిపాడ్, బహిరంగసభకు సంబంధించి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రుల పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. హెలిపాడ్, సభాస్థలి వద్ద బందోబస్తు ఏర్పాట్లు, వేదిక అలంకరణ ప్రముఖుల గాలరీ వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది రాకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

దహెగాం, మే 3 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్వింటాలు ధాన్యం ఏ గ్రేడ్ రకానికి 2,320, సాధారణ రకానికి 2,300 రూపాయలు ప్రభుత్వం చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలన్నారు. డీఎస్‌ఓ వినోద్‌కుమార్ మాట్లాడుతూ సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ దనుంజయ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోగేష్, ఆర్‌ఐ సుదీర్, ఏవో రామకృష్ణ, కార్యదర్శి నారాయణ, ఏఈవో వంశీ, సిబ్బంది సాయి, జీవన్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకా తీసుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న హెచ్‌ఈవో రవిదాస్

వాంకిడి, మే 3 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, పిల్లలు సకాలంలో వ్యాధి నిరోధక టీకా తీసుకోవాలని హెచ్‌ఈవో రవిదాస్ అన్నారు. మండలంలోని సరండి, నవెగుడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు అందిస్తున్న టీకా వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారాన్ని అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజ లకు వైద్యపరిక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూ చించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మమత, హెచ్‌ఏ భగవాన్ దాస్, ఏఎన్‌ఎం కృష్ణకుమారి, కాంత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

బెజ్జూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో శనివారం వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఎక్కడ చూసినా దొంగతనాలు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ క్రమంలో మండల కేంద్రంలో ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లయితే దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు.

అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని గౌతమినగర్ రామాలయం దగ్గర గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. సదరు వ్యక్తి 108 ద్వారా మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మూడు రోజులు క్రితం చేరాడు. శనివారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో చికిత్స పొందుతూ మరణించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని ఆసుపత్రిలో భద్రపరచినట్లు తెలిపారు. వివరాలు తెలిస్తే మంచిర్యాల పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. వివరాలకు ఇన్స్‌పెక్టర్ మంచిర్యాల 8712656534, ఎస్‌ఐ 8712656535 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

మందమర్రిరూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదిల్‌పేట గ్రామానికి ఆకుల శ్రీను అనే రైతుకు చెందిన ఆవు శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. రైతు ఇంటి నుంచి ఆదిల్‌పేట శివారు ప్రాంతానికి మేతకు వెళ్లిన ఆవు అక్కడ కింద ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు తగిలి మృతిచెందింది. ఆవు విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుందని , ప్రభుత్వ నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

పశువులు పట్టివేత

కాగజ్‌నగర్ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): కౌటాల నుంచి కరీంనగర్ వైపు అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నగర్ టౌన్ ఎస్సై సుధాకర్ తెలిపారు. కౌటాల పశువుల మార్కెట్ నుంచి 4 ట్రాలీల్లో 12 ఎడ్లను ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్నారన్నారు. ధర్మారం మండలంలోని గంగాధర పశువుల మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించేందుకు ఎడ్లను తీసుకెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అక్రమంగా తరలిస్తున్న ఎడ్లను, వాహనాలను పట్టుకొని వాటిని తరలిస్తున్న ఆవునూరి శ్రీకాంత్, పెరగండి శేఖర్, యాగండ్ల సంతోష్, ఆవునూరి అంజయ్యలపై కేసు నమోదు చేసి పశువులను, వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కాపువాడ ఆలయంలో చోరీ

కాగజ్‌నగర్ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టంలోని కాపువాడ పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని స్వామి వారి వెండి హారం, పాదుకలు చోరీ చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హనుమాన్ ఆలయంలో..

దహెగాం, మే 3 (ఆంధ్రజ్యోతి): బోర్లకుంట గ్రామంలోని శ్రీ భక్త అంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై కె రాజు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి అలయం తలుపుల తాళం పగులగొట్టి ఆలయంలో చొరబడి 15 తులాల వెండి కిరిటం, ఒక గ్రాం బరువుగల సీతమ్మ పుస్తెలతాడు అభరణాలు దొంగలు అపహరించుకు పోయి నట్లు ఆయన తెలిపారు. గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐదుగురి బైండోవర్

కాగజ్‌నగర్ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శుక్రవారం ఇరువర్గాలు గొడవ పడిన ఘటనలో ఐదుగురిని బైండోవర్ చేసినట్లు కాగజనగర్ టౌన్ ఎస్సై సుధాకర్ తెలిపారు. చిన్న ప్రమాదం విషయంలో ఇరువురు గొడవపడి కొట్టుకున్నట్లు చెప్పారు. ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమో దు చేసినట్లు తెలిపారు. కాగజ్‌గనర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

కౌటాలలో వడగళ్ల వర్షం

కౌటాల, మే 3 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి వడగళ్ల వర్షం కురిసింది. మొదట తీవ్ర ఈదురుగాలులు వీచాయి. అనంతరం పది నిమిషాల పాటు వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో బయట ప్రాంతాల్లో పనుల నిమిత్తం వెళ్లిన ప్రజలు భయాందోళన చెందారు. వడగళ్లవర్షానికి మండలంలో సాగు చేస్తున్న మిరప, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. వరి కోసి ఆరబోసిన ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

విద్యార్థులకు అభినందన

రెబ్బెన, మే 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు మీడియం చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పదో తరగతి విద్యార్థులను కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి అభినందించారు. విద్యార్థులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు తెచ్చుకున్న విద్యార్థులను అభినందించారు. అలాగే తెలుగు మీడియంలో ఫెయిల్ అయిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదవి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా ఆయన సూచిచారు. కార్యక్రమంలో డీవైపీఎం వేణు, ప్రధానోపాధ్యాయుడు రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనే ధ్యేయం



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

శ్రీరాంపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధనలో ఐఎన్‌టీయూసీ ముందంజలో ఉంటుందని ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. యూనియన్ 78వ ఆవిర్భావ వేడుకలను ఆర్‌కే 5 గని వద్ద ఘనంగా నిర్వహించారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత సీహెచ్. భీంరావు, ఉప ప్రధాన కార్యదర్శి గరిగె స్వామిలు జెండాను ఆవిష్కరించగా, శంకర్ రావు మాట్లాడారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసి సాధించిన ఏకైక యూనియన్ ఐఎన్‌టీయూసీ అని తెలిపారు. తమ యూనియన్‌లో .30 మిలియన్ల సభ్యులున్నారని, ఇది జాతీయ స్థాయిలో అత్యధికమని పేర్కొన్నారు. 1947 మే 3న ఐఎన్‌టీయూసీని స్థాపించారని గుర్తు చేసుకున్నారు. జాతీయ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డి, రాష్ట్ర సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ యూనియన్‌కు, కార్మికవర్గానికి ఎంతగానో సేవలందిస్తున్నారని కొనియాడారు. జాతీయ స్థాయిలో కార్మిక హక్కులను సాధించేందుకు, చట్టాల రూపకల్పనలో వారి కృషి ఎనలేనిదన్నారు. వారిద్దరు మహనీయులను గుర్తు చేసుకొని కార్యకర్తలు ముందుకు సాగాలని సూచిం చారు. కార్యక్రమంలో ఉప ప్రధాన కార్యదర్శులు పేరం రమేష్, ల్యాగల శ్రీనివాస్, ఆర్‌కే 5 పిట్ కార్యదర్శి నంబయ్య, సహాయ కార్యదర్శులు మహేష్ రెడ్డి, జే. శ్రీను, రవి, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి బి. రవి, జిల్లా ఉపాధ్యక్షుడు జె. నర్సింగ్, ఏరియా కార్యదర్శులు చందు పటేల్, బి. అశోక్, చిన్నయ్య, మహేందర్ రెడ్డి, రాజు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్టీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం మందమర్రిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో నాయకులు కాంపెల్లి సమ్మయ్య, దేవి భూమయ్యలు జెండా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధన కోసం తాము ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఏరియాలోని కేకే 5 గని వద్ద కూడా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మిట్ట సూర్యనారాయణ, వెంకటస్వామి, రాంశెట్టి నరేందర్, చంద్రశేఖర్, వేణు, బాపు, అన్ని గనుల పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన గనులతోనే సింగరేణి మనుగడ

మందమర్రి టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నూతన గనుల ఏర్పాటుతోనే సంస్థ మనుగడ సాధ్యమని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటి ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య పేర్కొన్నారు. శనివారం ఐఎన్టీయూసీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో కార్మిక గుర్తింపుసంఘం ఏఐటీయూసీ అన్ని రంగాల్లో దారుణంగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అయినా నెరవే ర్చిందా అని ప్రశ్నించారు. కార్మికుల సొంతింటి కల కోసం ఐఎన్టీయూసీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందని పేర్కొన్నారు. నూతన గనుల ఏర్పాటుతోనే ఉపాధి అవకాశాలు కొనసాగుతాయని నివేదికల రూపంలో ముఖ్యమంత్రికి ఇవ్వడానికి సిద్ధం ఉన్నామన్నారు. తమ యూనియన్ సెక్రెటరీ జనరల్, కనీస వేతనాల చైర్మన్ ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో కార్మికుల ప్రధాన సమస్యలను పరి ష్కరించాలని సీఎండీని కోరనున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధా నాలపై పోరాడుతామని తెలిపారు. లేబర్ కోడ్‌లను మార్చాలని చూస్తున్నటువంటి విధానాలను ఎండగడతామని చెప్పారు. ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం బాయిబాట చేపట్టామన్నారు. కార్మికులకు సమస్యలు ఉంటే తమను సంప్రదిం చాలన్నారు. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుంద న్నారు. కార్మిక సంక్షేమం తమ ప్రభుత్వంతోనే సాధ్యమని చెప్పారు. ఎల్లవేళలా కార్మికుల హక్కుల సాధనకు పాటుప డుతున్నామని తెలిపారు. సమావే శంలో నాయకులు దేవి భూమయ్య, కేంద్ర కమిటిచీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్, బండ భాస్కర్, మిట్ట సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

శ్రీరాంపూర్/మందమర్రి టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో 160 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని, 1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని సీఎండీ బలరాం అన్నారు. అన్ని ఏరియా జీఎంలతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గత ఏడాది ఏప్రిల్‌లో 5.66 లక్షల టన్నుల బొగ్గును వెలికి తీశామని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో 5.81 లక్షల టన్నులు ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. అలాగే ఓబీ 36.18 మిలియన్ క్యూబిక్ మీటర్లు కాగా, ఈసారి 40 మిలియన్ క్యూబిక్ మీటర్లుగా ఉందన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఒడిశాలో ప్రారంభమైన నైనీ బొగ్గు బ్లాకులో పనిచేసేందుకు సూపర్‌వైజర్ సిబ్బందిని ఎంపిక చేసి నెల రోజుల్లోగా అక్కడికి పంపిస్తామని తెలిపారు. కొత్తగా నియమితులైన ఉద్యోగులకు భూగర్భ గనుల్లో పనిచేసే విధంగా పోస్టింగులు ఇవ్వాలని ఆదేశించారు. మహిళా ఉద్యోగులతో ఒక ఓసీపీ, ఒక భూ గర్భ గని నడిపించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. బొగ్గు నాణ్యత సక్రమంగా లేకపోతే వినియోగదారులు దూరమవుతారని చెప్పారు. ఈ విషయం గుర్తుంచుకొని పని గంటలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డైరెక్టర్(ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు, డైరెక్టర్(ఆపరేషన్స్) సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ప్లానింగ్, పా) వెంకటేశ్వర్లు, జీఎం(సీపీపీ) ఎ. మనోహర్, అటవీ సలహాదారు మోహన్‌చంద్ర పరిగెన్, జీఎం(మార్కెటింగ్) రాజశేఖరరావు, కార్పొరేట్, అన్ని ఏరియా జీఎంలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

తాండూర్ : మండలంలోని రేచిని గ్రామపంచాయతీలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం అధికారులు, నాయకులు ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు సూరం రవీందర్‌రెడ్డి, ఎండీ ఈసా, సిరంగి శంకర్, పీఏసీఎస్ ఛైర్మన్, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : మండలంలోని ఆదిల్‌పేట గ్రామంలోని 1వ వార్డులో కొంత కాలంగా ఉన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్‌కు మహిళలు, ప్రజలు వినతి పత్రం అందించారు. భవానీ, దేవమ్మ, బారతి తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్: మండలంలోని గుడిపేట 13వ బెటాలియన్‌లో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో కమాండెంట్ రాములు దంపతుల ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు.

బెల్లంపల్లి: పట్టణంలోని కన్నాల బస్తీలో శనివారం వెంకటేశం అనే వ్యక్తి ఇంట్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దేవుని పటం ముందు దీపం వెలిగించి ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. ఒక్కసారిగా ఇంటిలో మంటలు చెలరేగడంతో కాలనీ వాసులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పారు. ప్రమాదంలో ఇంట్లో ఉన్న ఫర్నీచర్‌తో పాటు ఇతర సామాగ్రి కాలిపోయింది. అగ్ని మాపక సిబ్బంది శ్రీనివాస్, అశోక్, నారాయణ, మహేశ్ మంటలు ఆర్పారు.

బెల్లంపల్లి: కన్నాల శివారులో జాతీయ రహదారిపక్కన నూతనంగా నిర్మిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా న్యాయమూర్తి వీరయ్య అన్నారు. శనివారం కోర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. భవన నిర్మాణం పూర్తి కావడానికి ఇంకా ఎంత సమయం పడుతుందని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. జూనియర్ సివిల్ జడ్జి ముకేశ్ పాల్గొన్నారు

జన్నారం : జన్నారంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం సమ్మర్ క్యాంపులో పాల్గొనే వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో విజయ్‌కుమార్ మాట్లాడుతూ సమ్మర్ క్యాంపు నెల రోజుల పాటు ఉంటుందని, క్యాంపులో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఉంటుందని వలంటీర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

శ్రీరాంపూర్ : దేశంలోని యువజనులకు అండగా అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఉంటుందని జిల్లా కార్యదర్శి లింగం రవి పేర్కొన్నారు. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ వేడుకలు శ్రీరాంపూర్‌లోని కటిక దుకాణాల వద్ద శనివారం నిర్వహించగా, రవి హాజరై జెండా ఎగురవేశారు.

ఎండలతో జాగ్రత్త..



దండేపల్లి/జైపూర్ మే 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఈ మే నెల పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు బెంబే లెత్తిపోతున్నారు. ఈ ఎండలకు వడదె బ్బతో పాటు అనారోగ్యం పాలు కాకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తు న్నారు. ముఖ్యంగా ఎండలో పనిచేసేవారు ఉదయం 11 గంటలలోపు, సాయంత్రం 4 గంటల తర్వాత పని చేయాలని సూచిస్తున్నారు. తీవ్రమైన వేడి గాలులు వీచినప్పుడు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వడదెబ్బ ఎలా తగులుతుందంటే..?

ఎండ వేడిమి మనిషి మెదడులోని ఉష్ణోగ్రత్తను నియంత్రించే కేంద్రం దెబ్బ తినడంతో వడదెబ్బ తగులుతుంది. శరీర ఉష్ణోగ్రత 108 డిగ్రీ ఫారన్‌హీట్ నుంచి 110 డిగ్రీల వరకు పెరిగి నీరసించిపోతుంది. మాములు జ్వరం కంటే తీవ్రమైన వేసవిలో సాధారణంగా అపాయానికి గురి చేసేది వడదెబ్బ. దీన్నే హీట్ స్ట్రోక్ అంటారు. మండుటెండలో ఎక్కువ సేపు వృతిపర మైన కూలీ పనులు చేసేవారు, అత్యవసర పనులపై వెళ్లే వారిలో చాలా మంది వడదెబ్బ బారిన పడుతుంటారు. ఉష్ణోగ్రతలు 105 ఫారన్ హిట్‌కు మించడంతో పాటు నీరసించడం, సొమ్మసిల్లి పడిపోవడాన్నే వడదెబ్బ అంటారు. దీని తీవ్రత ఎక్కువైతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీని బారిన పడితే దాదాపు 40 శాతం మరణాలు సంభవిస్తాయి. తక్షణమే వైద్య సాయం అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది.

వృద్ధుల్లో...

సాధారణంగా వృద్ధులు వడదెబ్బ బారిన పడుతుంటారు. వయస్సు మీద పడడం, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుండడం, వయస్సు రీత్యా ఎక్కువగా ఉక్కపోతకు త ట్టుకోలేక పోవడం, విశ్రాంతి లేక పోవడం, శరీరం నల్లబడి ఉష్ణోగ్రత పెరగడం..

పిల్లల్లో...?

పిల్లలు వేసవిలో ఎండ సెగల్లోనే ఆటలు ఆడుతుంటారు. ఈ సమయంలో వారికి అంతగా ఎండ అని పించదు. శరీరానికి కావాల్సినంతగా నీరును అందించదు. శరీరానికి సరైనా పౌష్టికాహారం లేక వేసవి తాపానికి తట్టుకోలేక వడదెబ్బకు గురవుతుంటారు. ఈ సమయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం వీడి పిల్లలను ఎండలో తిరగకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. వైద్యుల చిట్కాలు తప్పని సరిగా పాటించాలి.

కారాణాలు ఇవి...

- వడదెబ్బ సోకెందుకు ప్రధానంగా శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం.
- శరీరంలో ఉష్ణాన్ని కోల్పోవడం.
- ఆహారం సరిగా లేకపోవడం, నీరుతక్కువగా తీసుకోవడం.
- విశ్రాంతి లేకుండా ఎక్కువగా ఎండలోనే పని చేయడం, మత్తు పానీయాలు తాగడం.

ప్రథమ చికిత్సలు...

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని సాధ్యమైనంత త్వర గా నీడనున్న ప్రాంతానికి తరలించాలి.
- అతని శరీరంపై ఉన్న దుస్తువులను తొలగించి చల్లని నీటితో కడగడం కాని, చల్లని నీటితో ముంచిన గుడ్డతో తుడవడం చేయాలి.
- చల్లని నీరు, ఉప్పు, ఇతర లవణాలు ఉన్న నీటిని తాగించాలి.
- ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరమంతా తుడుపుతూ చల్లని గాలి తగిలేలా చూడాలి.
- ఓరల్ రీహైడ్రేషన్ సోల్యూషన్(ఓఆర్ఎస్) ద్రావణాన్ని తాగించాలి.
- స్పృహ కోల్పోతే తక్షణమే వైద్యం అందేలా చూడాలి.

వేసవిలో జాగ్రత్తగా ఉండాలి ..



ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. సాధ్యమై నంత వరకు ఎండలో తిరగవద్దు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దు. రావాల్సి వస్తే నెత్తిన టోపీ, రుమాలు ధరించాలి, గొడుగును తెచ్చుకోవాలి. ఎండలో తిరిగితేనే వడదెబ్బ తగులుతుందని అనుకోవడం పొరపాటు. ఇనుప రేకుల కింద ఉన్నా వడ దెబ్బ తగులు తుంది. మసాలాలతో తయారు చేసిన ఆహారం తీసు కోవద్దు. ఆహార పదార్థాలను ఎప్పటిక ప్పుడు తయారు చేసుకోవాలి. ప్రభుత్వం అన్ని ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందు బాటులో ఉంచింది.

- డాక్టర్ ముస్తాఫా, జైపూర్ మెడికల్ ఆఫీసర్

ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు..

(1వ పేజీ తరువాయి)

ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ప్లాస్టిక్ కవర్లు కప్పి ఉంచుతున్నట్లు చెబుతున్నారు. సెంటర్లలో ధాన్యం దిగుబడికి అనుగుణంగా టార్పాలిన్లు అందుబాటులో ఉంచితే ఇబ్బందులు పడాల్సి వచ్చేదికాదని అభిప్రాయపడుతున్నారు.

వర్షంతో పొంచి ఉన్న ప్రమాదం....

జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ధాన్యానికి పెద్ద మొత్తంలో ప్రమాదం పొంచి ఉంది. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించినప్పటికీ....ఇంకా పూర్తిస్థాయిలో వరికోతలు ముగియలేదు.

ఇటీవల బుధ, గురువారాల్లో కురిసిన అకాల వర్షాలకు పలు మండలాల్లో చేతిక వచ్చిన పంట నీటిపాలు కాగా, కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యం కూడా తడిసి ముద్దయింది. జిల్లాలో 50 సెంటర్ల వరకు వర్ష సూచన ఉందని, జాగ్రత్తగా ఉండాలని అధికారులు ముందస్తుగా సూచించారు. దండేపల్లి, హాజీపూర్, చెన్నూరు, కోటపల్లి, భీమారం, నెన్నెల, వేమనపల్లి, జైపూర్ మండలాల్లో వర్ష సూచనపై రైతులతోపాటు, సెంటర్ల ఇన్‌చార్జిలను సైతం అప్రమత్తం చేశారు. అయినా జరగకూడని నష్టం జరిగిపోయింది. అకాల వర్షాల కారణంగా నెన్నెల, భీమారం, జైపూర్ మండలాల్లో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ముఖ్యంగా నెన్నెల మండలంలోని ఆవడం, చిత్తాపూర్, పొట్యాల, చిన్న వెంకటాపూర్, నెన్నెల, గుండ్ల సోమారం, నర్వాయిపేట, గొల్లపల్లి, ఖైలారం గ్రామాల్లో 177 మంది రైతుల వరి, జొన్న పంట నీటిపాలైంది. ఆయా మండలాల్లోని కోత దశకు వచ్చిన సుమారు 175 ఎకరాల్లోని పంటకు నష్టం వాటిల్లింది.

అన్ని చర్యలూ తీసుకుంటున్నాం..

మోతీలాల్, జిల్లా అదనపు కలెక్టర్



కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం అకాల వర్షాలకు తడవ కుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో వేగం పెంచాం. రైతుల నుంచి వెంట వెంటనే ధాన్యం కొనుగోలు చేసేలా సెంటర్ల సిబ్బందిని ఆదేశించాం. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని కూడా వీలైనంత త్వర గా రైస్ మిల్లులకు తరలించి, నిల్వ చేస్తున్నాం. కేంద్రాల్లో టార్పాలిన్లు కూడా అందు బాటులో ఉంచాము. జిల్లా వ్యాప్తంగా 50 సెంటర్లకు వర్ష సూచన ఉన్నట్లు అధికారులను ముందుగానే అప్రమత్తం చేశారు.

కుల గణనను స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

మందమర్రి టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన ను స్వాగతిస్తున్నామని బహుజన సమాజ్ పార్టీ సెంట్రల్, స్టేట్ కోఆర్డినేటర్ రామ చంద్ర పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించిన ఏడు దశాబ్దాల అనంతరం కుల గణన చేపట్టడం గొప్ప విషయమన్నారు. ఇటీవల జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కుల గణణ చేయడానికి చట్టాన్ని రూపొందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తప్పుడుగా కుల గణన చేసిందన్నారు. బీసీల జనాభా తగ్గించే విధంగా చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా కుల తణనకు సంబంధించి ఏమైనా తప్పులు ఉంటే కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. జోనల్ కోఆర్డినేటర్ కాదాసి రవిందర్, ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, శంకర్, రాజశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుకు పరిష్కారం

లక్షెట్టిపేట, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుకు అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపారు. మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలోని పంట కాలువను కొంత కాలం క్రితం బత్తుల మధూకర్ పూడ్చేసాడు. ఈకాలువ ద్వారా చాలా మంది రైతుల పంట పొలాలకు నీరు పోవాల్సి ఉండటంతో గ్రామంలో పలు మార్లు పంచాయితీ పెట్టుకున్నారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో బాధిత రైతు వేమునూరి శంకరయ్య గత నెల 22న లక్షెట్టిపేట తహసీల్దార్ దిలీప్‌కుమార్‌కు అర్జి పెట్టుకున్నాడు. స్పందించిన తహసీల్దార్ స్థానిక ఎస్సై గోపతి సురేష్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు ఇద్దరు కలిసి సిబ్బందితో సీన్ విజిట్ చేసి ఆక్రమించిన రైతును హెచ్చరించి సమస్యను పరిష్కరించారు.

విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించాలి

భీమిని, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వేసవి సెలవుల్లో వలంటీర్లు విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగే విధంగా గైడెన్స్ ఇవ్వాలని ఎంఈవో కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో భీమిని, కన్నెపల్లి, నెన్నెల మండలాలకు చెందిన వలంటీర్ల శిక్షణ తరగుతుల్లో ఎంఈవో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు గొప్ప లక్ష్యాలను ఏర్పచుకునేలా ముఖ్యపాఠ్యాంశాలను బోధించాలని, క్రీడలు, నీతికథలు, చదువు ప్రాముఖ్యతను విలువలతో కూడిన విద్యను నేర్పాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు వెంకటస్వామి, సుధాకర్, చక్ర వర్తి, మల్లికార్జున్, ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడిగా శ్రీపాల్



శ్రీపాల్‌కు నియామక పత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

చెన్నూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ చెన్నూరు పట్టణాధ్యక్షుడిగా తుమ్మ శ్రీపాల్ నియమితులయ్యారు. శనివారం చెన్నూరు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ తుమ్మ శ్రీపాల్‌కు నియామక పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బత్తుల సమ్మయ్య, మాజీ పట్టణాధ్యక్షుడు జాడి తిరుపతి, ప్రధాన కార్యదర్శి వెంకటనర్సయ్య, నాయకులు చారి, శ్రీనివాస్, రాజశేఖర్‌గౌడ్, శివకృష్ణ, మాణిక్, శంకర్, వంశీగౌడ్, రాజేశ్వర్, వెంకటేష్, బాపు, వినోద్, దుర్గా ప్రసాద్, రాజన్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణను అడ్డుకోవాలి

లక్షెట్టిపేట, మే 3(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని ఇటిక్యాల చెరువును కొంతమంది రియలెస్టేట్ వ్యాపారులు ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆ ఆక్రమణను ఆపాలని సీపీఐ(ఎమ్మెల్) న్యూ డెమోక్రసీ నాయకులు డిమాండ్ చేసారు. ఇటీవల మంచిర్యాలకు చెందిన ఒక వ్యాపారి చెరువులో మట్టిని తరలించేందుకు అనుమతులు తీసుకున్నాడని అధికారులు ఇచ్చిన అనుమతులకంటే ఎక్కువ మట్టిని చెరువు నుంచి తీయడంతో పాటు దాన్ని ఇటుకల తయారీకి కాకుండా రైతులకు అమ్ముకుంటున్నట్లు ఆరోపించారు. చెరువులో ఇష్టారీతిగా తవ్వకాలు జరిపి చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో మట్టిని నేర్పుతున్నారన్నారు. శనివారం చెరువు వద్ద జరుగుతున్న పనులను పార్టీ నాయకులు, గంగపుత్ర సంఘం సభ్యులు అడ్డుకుని అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకలు శ్రీనివాస్, దొంద ప్రభాకర్‌తోపాటు గంగాపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జనరేటర్ పెట్టి..నీరందించి

భీమారం, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం గాలివానకు విద్యుత్ తీగలపై చెట్లు పడి విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీరు, ఇతర అవసరాలకు బోరు మోటార్ల ద్వారా నీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి ఇదే గ్రామానికి చెందిన ధరావత్ బాపన్న తన జనరేటర్‌ను మోటారు పంపుసెట్‌కు విద్యుత్ వైర్లను బిగించి నీరు వచ్చేలా చేశాడు. దీంతో గ్రామస్థులు నీటిని పట్టుకున్నారు. బాపన్నను ప్రజలు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

దండేపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్గనూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న భక్తాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచు కాంద్రపు లక్ష్మణ్-శ్రీలత దంపతులు రూ. 25116 విరాళం అందజేశారు.

వీటిని శనివారం ఆలయ కమిటీ నిర్వాహకులకు గుడి నిర్మాణం కోసం విరాళం అందించారు. ఈసందర్బంగా కమిటీ సభ్యులు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వహకులు, సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

జన్నారం, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పాల్గొని సరస్వతి దేవికి పూజలు చేశారు. మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, నాయకులు గోపాల్, తిరుపతి, పవన్‌కుమార్, సంతోష్, రాజు నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రచారం

మందమర్రిరూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన లెక్చరర్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని శనివారం గ్రామాల్లో, రామకృష్ణపూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ కళాశాలలోని సౌకర్యాలను వివరించారు. ఉచిత విద్య, పుస్తకాలు, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లెక్చరర్లు రామయ్య, ప్రదీప్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలి



వెల్గనూర్ పాఠశాలలో మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్ఎం విజయలక్ష్మి

దండేపల్లి, మే3 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని వెల్గనూర్ ప్రభుత్వ పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి సూచించారు. శనివారం దండేపల్లి మండలం వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. మాట్లాడుతూ ఈనెల 15 వరకు ఈ సమ్మర్ క్యాంపు క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. సమ్మర్ క్యాంప్‌లో కోకో, వాలీబాల్, యోగ, ఫైన్ ఆర్ట్స్ అథ్లెటిక్స్‌పై శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

హాజీపూర్: మండలంలోని ముల్కల్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయా సబ్జెక్టుల్లో నిపుణులైన టీచర్లచే యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. శనివారం చిత్రలేఖనం, వ్యాయమ విద్య, యోగ, చెస్, ఇంగ్లీషు గ్రామర్, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థులకు మెలకువలు నేర్పించారు. విద్యార్థులకు హెడ్‌మాస్టర్ గణపతిరెడ్డి ఆధ్వర్యంలో స్నాక్స్ అందేశారు.

వేమనపల్లి : నీల్వాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సమ్మర్ క్యాంపును ఎంపీడీవో కుమారస్వామి, ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లోసమయాన్ని వృధా చేయకుండా చిత్రలేఖనం, యోగా, స్పోకెన్ ఇంగ్లీష్ , బేసిక్ మ్యాథ్స్ వంటివి సమ్మర్ క్యాంపులో నేర్చుకోవాలన్నారు.

అనంతరం పాఠశాలలో 500 పైన మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌రెడ్డి, నాయకులు సాబీర్ ఆలీ, గాలి మధు, సమ్మయ్య, పున్నం, మధుసూదన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మల్లేష్, ఆలీ, వెంకటేష్, రాజబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు. అనంతరం నీల్వాయి ఉన్నత పాఠశాల మైదానంలో ఖోఖో, క్యారం, చెస్ సమ్మర్ క్యాంపు పోటీలను ఎంపీడీవో, ఎంఈవోలు ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయులు మల్లేష్, భీమ్‌రావు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నాయకుల నిరసన

బెల్లంపల్లి, మే3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయం ముందు ఉన్న గాంధీ విగ్రహం ముందు శనివారం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు ఎండీ గౌస్ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎండీ గౌస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య తనపై పోలీసు స్టేషన్‌లో అక్రమ కేసు పెట్టించారని పేర్కొన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఫ్లెక్సీ కొన్ని రోజులుగా కాంగ్రెస్ కార్యాలయంలో ఉంటుందన్నారు. ఇటీవల ఫ్లెక్సీని తొలగించిన విషయంపై కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లయ్యను అడుగగా ఇష్టం వచ్చినట్టు దూషించారని పేర్కొన్నారు. అంతేగాకుండా ఈ విషయంపై ఎమ్మెల్యేను కాంగ్రెస్‌పార్టీని దూషించాడని స్థానిక పోలీసు స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు ఈ విషయంపై అధిష్టానం విచారణ జరిపి న్యాయం చేయాలని అలాగే అక్రమ కేసులు పెట్టించిన వ్యక్తులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మందక్రిష్ణను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

నస్పూర్, ఏప్రిల్ మే 3 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటంలో వర్గీకరణ సాధించిన సందర్భంగా హైదరాబాద్‌లో శనివారం మంద క్రిష్ణ మాదిగను నస్పూర్‌కు చెందిన ఎంఆర్‌పీఎస్ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యద ర్శులు చుంచు శంకర్‌వర్మ, మురళీ క్రిష్ణ, నాయకులు మహేశ్, సతీష్ కుమార్, అరికెల్ల సతీష్, పవన్, పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే

బెల్లంపల్లి, మే3(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ అన్నారు. శనివారం పట్టణంలో ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని భగత్‌సింగ్ విగ్రహం వద్ద నిర్వ హించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో సింహభాగం యువత ఉందని, రేపటి దేశ భవిష్యత్ యువత చేతుల్లోనేఉందని పేర్కొన్నారు. విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాల్లో ప్రభుత్వాలు యువతను ప్రోత్సహిస్తే మంచి పరిణామం చోటు చేసుకుంటుందన్నారు. యువత మత్తు పదార్థా లకు బానిసలు కాకుండా భవిష్యత్ వైపు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు చంద్ర మాణిక్యం, శ్రీను, ముస్తఫా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలి



న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి సాయికిరణ్

లక్షెట్టిపేట, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి కె.సాయికిరన్ అన్నారు. పట్టణ న్యాయస్తానంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శనివారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసం దర్భంగా జడ్జి మాట్లాడుతూ గ్రామాల్లో అదే విధంగా పాఠశాలలు, కళాశాలల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిచండం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ఉపాధ్యక్షుడు నళినికాంత్, ప్రధానకార్యదర్శి ప్రదీప్ కుమార్, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, అక్కల శ్రీధర్, కారుకూరి సురేందర్, గోవింద్‌రావు, రహమతుల్లా, పారాలీగల్ వాలంటరీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలి

కాసిపేట, మే3(ఆంధ్రజ్యోతి): వేసవిలో గని కార్మికులు వడదెబ్బ బారినపడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంపై బీజోన్ ఏరియా ఆసుపత్రి డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి శనివారం కాసిపేటగనిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ మనిషి శరీరంలో నీటి శాతం తగ్గడం వల్లనే ఎవరైన వడదెబ్బ బారిన పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఎండబారిన పడకుండా ఉపశమనం పొందేందుకు నీరు ఎక్కువగా తీసుకోవాలి. డబ్ల్యుహెచ్‌వో సర్టిఫైడ్ చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్స్ 200 మిల్లీలీటర్ల నీటిలో కలుపుకొని తాగాలన్నారు. లేదా నీటిలో నిమ్మరసం, ఉప్పు కలుపుకొని వేసుకోవడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. ఇంటిలో కూలర్ వాడే వారు నీటిని ఎప్పటికప్పుడు మార్చుకోవాలి. కారువాడుతున్న ప్పుడు ఎండలో ఉండడం వల్ల వేడి పెరిగి ఏసీవేయడం వేడిగాలి వచ్చి ప్రమాదబారినపడే అవకాశాలు ఉన్నాయి. మందమర్రి ఏరియా రక్షణ అధికారి రవీందర్ మాట్లాడుతూ కార్మికులు విధులకు హాజరయ్యేందుకు వెళ్లేటప్పుడు తగిన రక్షణ సూత్రాలు పాటించి వడ దెబ్బ నుంచి రక్షణ పొందాలన్నారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగాం మల్లేశ్, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, లక్ష్మీనారాయణ, రక్షణ అధికారి నిఖిల్, డిప్యూటీ మేనేజర్ వెంకటేశ్వర్, బన్న లక్ష్మణ్ దాసు, రాజేందర్, సురేశ్, సొల్లంగి శ్రీనివాస్, పాల్గొన్నారు.



కాసిపేటగనిపై మాట్లాడుతున్న ఏరియా ఆసుపత్రి లోక్‌నాథ్ రెడ్డి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల జిల్లా వార్తలు

1

ఆదివారం 4 మే 2025

అర్హులకు రేషన్‌కార్డులు

అదనపు కలెక్టర్ మోతిలాల్

నస్పూర్, ఏప్రిల్ మే 3 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి రేషన్‌కార్డు జారీ చేస్తామని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పెండింగ్‌లో ఉన్న నూతన రేషన్ కార్డులు, కార్డుల్లో సభ్యులను చేర్చడంపై దరఖాస్తులపై విచారణ జరిపి అర్హులైన వారిని ఎంపిక చేసి జిల్లాలో 956 నూతన రేషన్‌కార్డులు మంజూరైనట్లు తెలిపారు. రేషన్‌కార్డుల్లో పిల్లలను చేర్చుట, ఇతర మార్పులకు సంబంధించి 29,237 దరఖాస్తులు విచారించి ఆమోదించామన్నారు. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు.

శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌కు ఘన స్వాగతం



బండ ప్రకాశ్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు

నస్పూర్, ఏప్రిల్ మే 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌కు నస్పూర్‌లోని సీసీసీ సింగరేణి అతిథి గృహం వద్ద శనివారం రెవెన్యూ అధికారులు స్వాగతం పలికారు. ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొన్నడానికి వచ్చిన ఆయన గెస్ట్ హౌస్‌కు వచ్చారు. స్వాగతం పలికిన వారిలో ఆర్డీవో శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ హరిత, ఆర్ఐ చందర్, పాల్గొన్నారు.

ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు



మంచిర్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు కురుస్తుండటంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం వరి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచింది. జిల్లాలో వరి కోతలు ప్రారంభమై ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుతుండటంతో రైతులు సైతం ఆందోళనకు గురవుతున్నారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన ధాన్యం కల్లాల్లోనే తడిచి ముద్దవుతుందేమోనన్న బెంగ వారిని వెంటాడుతోంది. గతంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడంతో వర్షాలు పడి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. దాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు యాసంగి సీజన్‌లో ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసి, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు అంతే వేగంగా ధాన్యం సేకరణ, నగదు చెల్లింపుల ప్రక్రియలో కూడా స్పీడ్ పెంచారు.

- జిల్లాలో 361 కేంద్రాలకుగాను 341 ప్రారంభం
- 160 కేంద్రాల ద్వారా 37,730.240 టన్నుల సేకరణ
- వెంట వెంటనే కాంటా, ఆన్‌లైన్‌లో నమోదు
- రైతులకు రూ.15.47 కోట్లు చెల్లింపు
- వర్షాలను దృష్టిలో ఉంచుకుని అధికారుల చర్యలు

మూడు లక్షల పై చిలుకు దిగుబడి అంచనా...

గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి రబీ సీజన్‌లో వరి సాగు జిల్లాలో ఘననీయంగా పెరిగింది. ఈ సీజన్‌లో జిల్లాలో లక్షా 21,702 ఎకరాల్లో వరి పంట సాగైంది. ఇందులో దొడ్డు రకం లక్షా 14,774 ఎకరాలు కాగా, సన్నరకం 6,928 ఎకరాల్లో సాగు చేయగా, 3,40,301 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇందులో దొడ్డు రకం 3,23,639 మెట్రిక్ టన్నులు కాగా, సన్నరకం ధాన్యం 16,662 మెట్రిక్ టన్నులు వస్తుందని భావిస్తున్నారు.

ఇబ్బందికరంగా మారిన టార్పాలిన్ల కొరత...

రైతులు ధాన్యం విక్రయించే ముందు ప్రభుత్వం సూచించిన మేరకు తేమ లేకుండా ఆరబెట్టాల్సి ఉంటుంది. దీంతో కోసిన తరువాత ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి, అక్కడ మూడు, నాలుగు రోజులపాటు రైతులు ఆరబెడతారు. జిల్లాలో ఆకాల వర్షాల సూచన ఉండటంతో టార్పాలిన్‌లతో ధాన్యాన్ని రక్షించుకోవాల్సి న అవసరం ఉంది. కొనుగోలు కేంద్రాల్లో అందుబాటు లో ఉన్న టార్పాలిన్లు ఉపయోగించి, ధాన్యాన్ని రక్షించుకోవాలని అధికారులు సూచిస్తుండగా, సరిపడా టార్పాలిన్లు లేక కొంతమేర..

(తరువాయి 3లో)

332 కేంద్రాల ఏర్పాటు...

యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా డీఆర్‌డీఏ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో 361 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, శనివారం వరకు 341 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 160 కేం ద్రాలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా 37,730.240 టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి, రూ. 15.47 కోట్లను వారి బ్యాంక్ అకౌంట్లలో జమ చేశారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల ద్వారా నిత్యం సగటున 4 వేల నుంచి 6వేల టన్నులు కాంటా వేస్తుండ గా, దాదాపు 150 పై చిలుకు లారీలు ఏర్పాటు చేసి 3 వేల టన్నుల వరకు ధాన్యాన్ని ఎంపిక చేసిన రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ధాన్యం నిలువ ఉంచేందుకు మంచిర్యాల జిల్లాలో 16 మిల్లులను ఎంపిక చేయగా, కరీంనగర్ జిల్లాలోని 48 మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నారు.

నీట్‌కు ఏర్పాట్లు పూర్తి...

- జిల్లా కేంద్రంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు
- 1204 మంది అభ్యర్థుల కేటాయింపు



పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): 'నీట్' పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం నిర్వహించనున్న నీట్ పరీక్ష కోసం జిల్లా కేంద్రంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాజీవ్‌నగర్‌లోని తెలంగాణ ఆదర్శపాఠశాల, జిల్లా పరిషత్ బాలురు, బాలికల పాఠశాలల తోపాటు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా సెంటర్లకు మొత్తం 1204 మంది అభ్యర్థులను కేటాయించారు. పరీక్ష ఈ నెల 4న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగనుండగా, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30లోగా అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవలసి ఉంటుంది. పరీక్షల నిర్వహణ కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటుతోపాటు కేంద్రాల్లో సీసీ కెమెరాల బిగించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఆభరణాలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించారు. అలాగే ఒక్కో పరీక్ష కేంద్రానికి ముఖ్య పర్యవేక్షకుడితోపాటు పాలనా విభాగం, పోలీస్ శాఖల నుంచి ఒక్కొక్కరు చొప్పున నోడల్ అధికారులను నియమించారు. సమయంలో కేంద్రాల చుట్టూ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 144, 163 సెక్షన్ ను అమలు చేయనున్నారు. ఆయా సెంటర్ల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసి వేయడంతోపాటు, నలుగురు కంటే ఎక్కువ మంది సంచరిం చకుండా చర్యలు తీసుకోనున్నారు. పరీక్షకు సంబంధించి సిస్టమ్స్ ఇన్విజి లేటర్లకు ఇప్పటికే అన్ని సూచనలు జారీ చేశారు.

పరీక్షా కేంద్రాలను శనివారం కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

కేంద్ర మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్ గౌడ్, పాల్గొన్న మాజీ అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రవాణా, రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ప్రజలు పార్టీ శ్రేణులను కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తో కలిసి మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా మంచిర్యాల-చంద్రాపూర్ మధ్య 3,500 కోట్ల వ్యయంతో ఈ నెల 5న కేంద్ర మంత్రి ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం కాగ జ్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద ఎన్‌హెచ్-163 జాతీయ రహదారి ప్రారంభోత్సవం చేసిన అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలతో రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు విమర్శలు గుప్పించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇటీవల బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్లలో రూ. 11 కూడా ఇవ్వలేదని మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కొయ్యల ఏమాజీ, పెద్దపల్లి పురుషోత్తం, దుర్గం అశోక్, పట్టి వెంకట కృష్ణ, ఎనగందుల కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, ప్రభాకర్, రమణరావు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోండి

జిల్లా స్థాయి క్యాంపు ప్రారంభోత్సవంలో కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్‌లోని కస్తూర్బా పాఠశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఏప్రిల్ మే 3 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో విజ్ఞానంతో పాటు వినోదాన్ని పొందుతూ పాఠ్య, పాఠ్యేతర అంశాలను నేర్చుకునే అవకాశం సమ్మర్ క్యాంప్‌ల ద్వారా లభిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్‌కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్ పట్టణంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో శనివారం జిల్లా స్థాయి బాలికల సమ్మర్ క్యాంప్‌ను జ్యోతి ప్రజ్వళన చేసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ క్యాంప్‌లో స్పోకెన్ ఇంగ్లీష్, స్పీడ్ మ్యాథ్స్, డ్యాన్స్, మ్యూజిక్, యోగ, మెడిటేషన్, కంప్యూటర్, కోడింగ్, పెయింటింగ్స్ మొదలైన అంశాలు ఈ సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక విద్యార్థి ఈ శిక్షణలో పాల్గొనే అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఇక్కడ నేర్చుకున్న వివిధ అంశాలు జీవితంలో ఎదగడానికి ఉపకరిస్తాయన్నారు. జిల్లాలోని 18 కేజీబీవీల నుంచి దాదాపు 200 మంది విద్యార్థినులు శిక్షణకు రావడానికి కృషి చేసిన స్పెషల్ ఆఫీసర్లను, టీచర్‌లను కలెక్టర్ అభినందించారు. ఈ క్యాంప్ 15 రోజులపాటు సక్రమంగా నడిపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు చౌదరి యశోదర, సత్యనారాయణమూర్తి, నస్పూర్ మండల విద్యాధికారి దామోదర్‌రావు, క్యాంప్ కోఆర్డినేటర్ నస్పూర్ స్పెషల్ ఆఫీసర్ మౌనిక, అసిస్టెంట్ క్యాంప్ కోఆర్డినేటర్ స్వర్ణలత, జిల్లాలోని కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణపై ఎప్‌సెట్ కన్వీనర్‌కు ఫిర్యాదు

నస్పూర్, ఏప్రిల్ మే 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసి, కామన్ ఎంట్రన్స్ సెట్ ఆన్‌లైన్ పరీక్షకు హాజరైన మంచిర్యాలకు చెందిన అనవేణ అమార్త్య హాల్ టిక్కెట్ నంబర్ (2523ఎల్ 11078)కు కేటాయించిన కంప్యూటర్ సరిగా పనిచేయక పోవడంతో పరీక్ష రాయలేకపోయాడు. పని చేయని కంప్యూటర్‌ను తనకు కేటాయిం చారని ఎప్‌సెట్ కన్వీనర్‌కు ఫిర్యాదు చేసినట్లు విద్యార్థి, తం డ్రి శ్రీనివాస్ తెలిపారు. శనివారం పెద్దపల్లిలోని ట్రినిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఉదయం పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. తనకు కేటాయించిన కంప్యూ టర్ సరిగ్గా పని చేయకపోవడంతో ముందుగానే ఇన్విజిలేటర్‌కు చెప్పామన్నారు. మౌస్‌లో సమస్య ఉన్నట్టు గుర్తించిన ఇన్విజిలేటర్ దానికి పరి ష్కారం చూపించకపోవడంతో సమయం వృథా అయిందని వాపోయారు. ఈ విషయమై ఎప్‌సెట్ కన్వీనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మరోసారి పరీక్ష రాసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.

నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

లక్షెట్టిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): నియోజికవర్గ ప్రజలకు మంచి నాణ్యమైన వైద్యంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన కార్పోరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించడమే తన లక్ష్యం అని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ ఆసుపత్రి భవనంతో పాటు ప్రభుత్వ కళాశాల భవనాల నిర్మాణం పనులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం కూడా విద్యా, వైద్య రంగంపై ప్రత్యేక దృష్టితో ముందుకు సాగుతుందన్నారు. మన లక్షెట్టిపేట పట్టణంలో రానున్న రోజుల్లో విద్య వైద్యం విషయంలో రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా మన జిల్లా ఉండాలనే లక్ష్యంతో అధికారులు, నాయకుల పర్యవేక్షణలో పనులు ఎప్పటికప్పుడు పరిశీలించి సంభందిత అధికారులతో చర్చిస్తున్నామన్నారు. ప్రభుత్వ కళాశాల, పాఠశాల భవన నిర్మాణం పనులు ప్రారంభించి సంవత్సరం కూడా పూర్తి కాలేదని కేవలం పది నెలల్లోనే పనులు చివరి దశకు చేరకున్నాయంటే ఇది రాష్ట్రంలోనే రికార్డు అన్నారు. వచ్చె నెల 12వ తేదీన ఆసుపత్రి భవనంతో పాటు కళాశాల, పాఠశాల భవనాలు కూడా ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఆసుపత్రి సూపరిండెంట్ ఆకుల శ్రీనివాస్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ ఆరీఫ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, నాయకులు పూర్ణచందర్‌రావు, బొప్పు సుమన్, గడ్డం త్రిమూర్తి, గడ్డం శ్రీనివాస్, చింత అశోక్‌కుమార్, నలిమెల రాజు,అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.

ఈ ఏడాది క్లాసులు ప్రారంభమయ్యేల చర్యలు తీసుకోవాలి

హాజీపూర్: ఈ విద్యా సంవత్సరం క్లాస్‌లు ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులను, గుత్తేదారును ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదేశించారు. శనివారం కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి గుడిపేటలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ భవనాన్ని సందర్శించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. బిల్డింగ్‌కు వేసిన రంగును చూసి అసహనం వ్యక్తం చేస్తూ వెంటనే రంగు మార్చాలని గుత్తేదారును ఆదేశించారు. హాస్టల్ భవనం లోపల పనులను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు.

ఉగ్రదాడికి నిరసనగా బంద్

జిల్లా కేంద్రంలో వాణిజ్య, వ్యాపార సంస్థల మూసివేత

రాజకీయ పార్టీల నిరసన ర్యాలీలు



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల ఐక్య వేదిక నాయకులు


మంచిర్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడిని ఖండిస్తూ హిందూ సంఘాల ఐక్య వేదిక, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కుల సంఘాలు, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో చేపట్టిన మున్సిపల్ కార్పొరేషన్ బంద్ విజయవంతం అయింది. వ్యాపార సంస్థలు, సినిమా టాకీస్‌లు, హోటళ్లు, పెట్రోల్ బంక్‌ల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఉదయం నుంచి తమ వ్యాపార సంస్థలన్నింటినీ మూకుమ్మడిగా మూసి ఉంచారు. పట్టణంలో షాపులన్నీ మూసి ఉండటంతో వీధులన్నీ బోసిపోయాయి. బంద్ సందర్భంగా హిందూ ఐక్య వేదిక, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, ఉగ్రవాదుల వైఖరిపట్ల తమ నిరసనను తెలియజేశారు. బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీజేపీ నుంచి జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తూముల నరేష్ పాల్గొని తమ తమ పార్టీల మోటార్ సైకిల్ ర్యాలీలకు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలు, వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని తుదముట్టించే వరకు భారత్ వెనకడుగు వేయవద్దని, భారతీయులంతా ప్రభుత్వానికి మద్దతుగా నిలు స్తామని స్పష్టం చేశా రు. దాడికి పరోక్ష కారణమైన పాకిస్తాన్‌పైనా గట్టి చర్యలు తీసుకోవా లని కోరారు.

నస్పూర్ : జమ్మూ కాశ్మీర్‌లో హిందువులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ నస్పూర్ పట్టణంలో శనివారం వ్యాపార వాణిజ్య సంస్థలు బందు పాటించాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణంలో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : పహెల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా శనివారం క్యాతనపల్లి మున్సిపాలిటీ బంద్ విజయవంతమైంది. హిందూ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునివ్వగా వ్యాపారులు దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

హాయిగా నవ్వుకోండి

నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం



నస్పూర్, ఏప్రిల్ మే 3 (ఆంధ్రజ్యోతి) : మనిషికి దే వుడిచ్చిన వరం అందమైన చిరునవ్వు... ముఖానికి అదే విశేష అలంకారం... మనిషి తప్ప లోకంలో నవ్వగలిగిన జీవి మరొకటి లేదు. మనిషి ఆరోగ్యకరమైన మనసుంటే అది అందమైన చిరునవ్వు మాగిజీ అవుతోంది. నవ్వు నాలుగు విధాలా చేటన్నది పాత మాట.. కానీ అదే నవ్వు నలభై విధాల మేలన్నది నేటి మాట.. ఔననే అంటారు.. నవ్వడం ఒక వరం ఒక నవ్వుతో ఎన్నో సమస్యలు మాయమ వడం ఖాయం. అందుకేనేమో నవ్వుల రేడు జం ద్యాల ఒకనొక సందర్భంలో ఇలా సంబోధించారు. నవ్వడం ఒక యోగం, నవ్వించడం ఒక భోగం, నవ్వకపోవడం ఒక రోగమని. ఇది నిజంగా అక్షర సత్యం... ఆధునిక సమాజంలో నిరంతరం మానసిక ఒత్తిళ్లకు లోనవుతూ నవ్వుకు దూరమై పోతున్నారు. రుతు పవనాల మాదిరిగానే మతి పవనాలు గతి తప్పడం వలన ఇలాంటి దుస్థితి ఏర్పడుతున్నాయి. నవ్వు ఒక ఔషదం, ఇది ఎన్నో రోగ లక్షణాలను అంతరంగంలోని మూలాలను తొలగిస్తోంది. మే మొదటి ఆదివారం (ఈ నెల 4) నవ్వుల దినోత్సవం సందర్భంగా...

● నేపథ్యం...

ఈ దినోత్సవాన్ని మొదట్లో జనవరి రెండో ఆదివారం జరుపుకునే వారు. చాలా దేశాల్లో జనవరిలో చలి వాతావరణం ఎక్కువగా ఉండడం తో ఈ తేదీని మార్చాలని నవ్వుల ప్రియులు కోరారు. లాఫ్టర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే నెల మొద టి ఆదివారం నిర్వహించాలని నిర్ణయించారు. స్టీవ్ విల్సన్ అనే మనస్తత్వ శాస్త్రవేత్త మొదట తన వృత్తిలో భాగంగా హా స్యానికి మానవుల మానసిక ప్రవృత్తికిగల సంబంధాల మీద పరిశోధనలు చేస్తూ వర్క్‌షాప్‌ను నిర్వహించాడు. 1997లో ఇండస్ ఫౌండేషన్ అనే భారతీయ సంస్థ టూ క్రియేట్ ఏ పాజిటివ్ వర్కింగ్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశం మీద ప్రసంగించడానికి భారత్‌కు ఆహ్వానించింది.

అప్పటికే ముంబాయిలో జూహు బీచ్ లాఫ్టర్స్ క్లబ్ డాక్టర్ మదన్ కతారియా నెలకొల్పాడు. ఈ క్లబ్‌ను హాస్య యోగా అని పిలిచారు. 1998 జులైలో విల్సన్‌తో కలిసి వరల్డ్ లాఫ్టర్ టూర్‌ను నిర్వహించారు. దీంతో నవ్వుల దినోత్సవానికి అంతర్జాతీయ ప్రచారం లభించింది. డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగేన్ 2000 జనవరి తొమ్మిదిన నిర్వహించారు. ఈ ఉత్సవం గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో నమోదైంది. దీంతో మొదట జనవరిలో నిర్వహించిన నవ్వుల దినోత్సవం 2004 నుంచి మే మొదటి ఆదివారానికి మార్చారు.